# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 285 | పేజీలు: 7 | వెల: రూ.3/- | శనివారం 24 జనవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608


# సిట్ విచారణకు కేటీఆర్

# 7 గంటల పాటు విచారణ

### ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని మండిపాటు

### ఫోన్ ట్యాపింగ్ కేసు .. 7 గంటల పాటు కేటీఆర్ విచారణ

### మాజీ డీసీపీ రాధాకిషన్ రావుతో కలిపి కేటీఆర్‌ను విచారించిన సిట్ అధికారులు



**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సిట్ విచారణ ముగిసింది. ఈ కేసులో ఏ-4 నిందితుడిగా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుతో కలిపి కేటీఆర్‌ను అధికారులు విచారించారు. దాదాపు 7 గంటల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు వాంగ్మూలం రికార్డు చేశారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై వీరిద్దరినీ ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రశ్నించింది. రాధాకిషన్‌రావు గతంలోనూ సిట్ విచారణకు హాజరయ్యారు.

సిట్ విచారణకు హాజరైన కేటీఆర్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇవాళ సిట్ విచారణకు హాజరయ్యారు. తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతకుముందు తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతానన్నారు.

కేసులు తమకు కొత్తకాదని, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని కేటీఆర్ అన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చామన్న ఆయన, అనుక్షణం జనం కోసమే పనిచేశామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే పనిచేశామని, తప్పుడు పనులు చేయలేదన్నారు. ఎంతో నిబద్ధతతో రాష్ట్రం కోసం పనిచేసినట్లు తెలిపారు. ప్రత్యర్థుల కుటుంబాలపై బురదజల్లే పనులు తాము చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కు లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొత్తకొత్త నాటకాలతో కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్

..మిగతా 2లో

### బిఆర్ఎస్ నేతలతో

## కెటిఆర్, హరీష్ భేటీ

**సిట్ విచారణపై పార్టీ నేతలతో సమాలోచనలు**

2లో..

**ఓటుకు నోటు దొంగ సిఎం కావడంతోనే వేధింపులన్న కెటిఆర్**



# కేరళలోనూ గుజరాత్ సీన్ రిపీట్

**త్వరలో అధికార మార్పు తప్పదు: ప్రధాని మోదీ**

**కేరళలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది**

**పేదల సంక్షేమం కోసం ఒక కార్యక్రమం ప్రారంభించాం**

**పీఎం స్వనిధి క్రెడిట్ కార్డు ప్రారంభించాం- మోదీ**

**తిరువనంతపురం, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

గుజరాత్‌లో కేవలం ఒక నగరంలో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం, ఆ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వరకు వెళ్లిందని, ఇప్పుడు కేరళలోనూ అదే జరుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవల తిరువనంతపురం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలే అందుకు నిదర్శనమని చెప్పారు. కేరళ ప్రజలు బీజేపీపై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేరళలో ప్రభుత్వ మార్పు తప్పదని విశ్వాసం వ్యక్తం చేశారు. తిరువనంతపురం నుంచి అమృత్ భారత్ సూపర్‌ఫాస్ట్ రైలును ప్రధాని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ పాల్గొన్నారు. ఈ రోజు ఇక్కడ నేను ఓ కొత్త ఆశను చూస్తున్నాను. మీలోని ఉత్సాహం చూస్తుంటే, కేరళలో నిజంగానే మార్పు వచ్చే అవకాశం ఉందని మాకు విశ్వాసాన్ని ఇస్తోంది. 1987కి ముందు, గుజరాత్‌లో బీజేపీ ఒక సాధారణ పార్టీగా ఉండేది. 1987లో

..మిగతా 2లో

# సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే




**తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**

**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్: తాము కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే బీఆర్ఎస్ నేతలు జైల్లో ఉండేవారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపించారు. హైదరాబాద్ భూములను ప్రైవేట్ వాళ్లకు అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లమని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుందన్నారు.

"నక్సల్స్ వంకతో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అధికారులు చెప్పారు. నటులు, వ్యాపారులు ఏమైనా తీవ్రవాదులా.. ఎందుకు ట్యాప్ చేశారు. కవిత బయటపెట్టిన వాటికి ఆధారాలు ఇవ్వాలని కోరుతున్నా. 547 మంది ఫోన్లను ట్యాప్ చేశారని అధికారులు చెబుతున్నారు" అని

..మిగతా 2లో




# అమెరికా మరో సంచలన నిర్ణయం

**డబ్ల్యూహెచ్‌వోనుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటన**

**వాషింగ్టన్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అనేక విషయాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కార్ ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వోనుంచి అధికారికంగా వైదొలిగింది. రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు

..మిగతా 2లో

# రియల్ ఎస్టేట్ అడ్డాలో కార్పొరేషన్ కురుక్షేత్రం

**శేరిలింగంపల్లి : జనవరి 23, (ప్రభాత ఉదయం)**

ఐటి హబ్ గా విద్యవంతులకు నిలయంగా రియల్ ఎస్టేట్ కు గండెకాయలాంటిది శేరిలింగంపల్లి. రాజకీయ పార్టీ నాయకులు రియల్ ఎస్టేట్ నాలుగు డబ్బులు సంపాదించి యువకులు కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. జాతీయ అంతర్జాతీయ ఐటి పరిశ్రమలు ఈ ప్రాంతంలో కొలువుదీరడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడుస్తుంది. ఏ ప్రాంతంలోనైనా రియల్ ఎస్టేట్ ఒడిదుడుకులకు లోనైనా హైటెక్ సిటీ పరిధిలో స్థిరంగా ఉండడం గమనర్హం. రియల్ ఎస్టేట్ లో నాలుగు డబ్బులు సంపాదించిన యువత కార్పొరేషన్ ఎన్నికల బరిలో దిగేందుకు" సై" అంటున్నారు. శేరిలింగంపల్లి జోన్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కుతుంది. ఫిబ్రవరి 10తో ప్రస్తుత కార్పొరేటర్ల పదవీకాలం ముగియనుండటంతో, అధికారాన్ని నిలబెట్టుకోవాలని కొందరు, కొత్తగా పాగా వేయాలని మరికొందరు వ్యూహరచన చేస్తున్నారు. కార్పొరేషన్ ఎన్నికలు మరో మూడు నేలలో జరుగుతాయని ప్రచారం జరుగుతుడడంతో శేరిలింగంపల్లి ఎన్నికల కురుక్షేత్రాన్ని తలపిస్తుంది. రియల్ ఎస్టేట్ అడ్డాలో రాజకీయ చదరంగం అడేందుకు పాత కొత్త నాయకులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు.

హైదరాబాద్ మహానగరంలో శేరిలింగంపల్లి జోన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఐటీ కారిడార్, ఆకాశాన్ని తాకే భవనాలు, శరవేగంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ఇది గుండెకాయ వంటిది. అందుకే ఇక్కడి కార్పొరేటర్




శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ ఫోటో..

పీఠం అంటే కేవలం ప్రజా సేవ మాత్రమే కాదు, అపరిమితమైన వనరులకు, అధికారానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రస్తుత కార్పొరేటర్లలో అనేకులు తమ డివిజన్లను సొంత సామ్రాజ్యాలుగా భావిస్తున్నారు. రిజర్వేషన్లు మారితే తమ కుటుంబ సభ్యులను రంగంలోకి దింపేందుకు ఇప్పుడే పావులు కదుపుతున్నారు. పతులు, సతులు మహిళా రిజర్వేషన్ వస్తే భార్యలను, జనరల్ అయితే భర్తలను నిలబెట్టి తెర వెనుక చక్రం తిప్పాలని చూస్తున్నారు. తమ కుమారులు లేదా బంధువులను రాజకీయ వారసులుగా పరిచయం చేస్తూ 'టికెట్ మా కుటుంబానికే' అనే గట్టి పట్టుబడుతున్నారు.

గడిచిన ఐదేళ్ల కాలాన్ని విశ్లేషిస్తే, ప్రజా సమస్యల పరిష్కారం కంటే ఆర్థిక లావాదేవీలకే ప్రాధాన్యత పెరిగిందనే విమర్శలు బలంగా వినిపిస్తంన్నాయి. ఈ ప్రాంతంలో చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా భారీ వెంచర్లు వేయాలన్నా కొందరు ప్రజాప్రతినిధుల 'మామూళ్ల' పంపిణీ తప్పనిసరి అయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలు,

..మిగతా 2లో

# ఫోన్ ట్యాపింగ్ సర్వసాధారణం

**అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తాయి**

**బిఆర్ఎస్ నేతలను టార్గెట్ చేయడం దారుణం**

**సిట్ విచారణాధికారం సజ్జన్నార్‌కు లేదు**

**బిఆర్ఎస్ నేత, మాజీ ఐపిఎస్ ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ ప్రజల భద్రతతో పోలీసు అధికారులు ఆడుకుంటున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తమ పోస్టింగ్‌ల కోసం పోలీసులు వికృత క్రీడలో భాగస్వాములయ్యారని తెలిపారు. హరీశ్‌రావు, కేటీఆర్‌కు సంబంధం లేని శాఖల గురించి పోలీసులు విచారణకు పిలిచారని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులతో కలసి మీడియాతో మాట్లాడుతూ.. ట్యాపింగ్‌కు

..మిగతా 2లో

# కేరళలోనూ గుజరాత్ సీన్ రిపీట్

మొదటి పేజీ తరువాయి...

మొదటిసారిగా బీజేపీ అమ్దావాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను గెలుచుకుంది. సరిగ్గా ఈ రోజు మీరు తిరువనంతపురంలో గెలిచినట్లే. అక్కడి నుంచి గుజరాత్‌లో ప్రారంభమైన పరంపరలో, ప్రజలు మా పనిని చూశారు. మా పార్టీ ప్రవర్తనను అంచనా వేశారు. దాని ఫలితంగా, గత అనేక దశాబ్దాలుగా అక్కడి ప్రజలు మాకు అవకాశాలు ఇస్తూనే ఉన్నారు. ఇదంతా ఒక నగరంతో ప్రారంభమైంది. కేరళలో కూడా, ఇది ఒక నగరంతోనే ప్రారంభమైంది. అందుకే నేను చెబుతున్నాను. కేరళ ప్రజలు బీజేపీపై విశ్వాసంతో మాతో జతకట్టారు.

-- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి



**తిరువనంతపురాన్ని ఎల్డీఎఫ్, యూడీఎఫ్ నిర్లక్ష్యం చేశాయి ప్రధాని మోదీ**

తిరువనంతపురం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఎల్డీఎఫ్, యూడీఎఫ్ అవినీతి పాలన నుంచి కేరళను విముక్తి చేయాలనే దృఢ సంకల్పానికి లభించిన విజయమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటములు తిరువనంతపురాన్ని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని నగరమైన తిరువనంతపురంలో కనీస సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

"వామపక్షాలు, కాంగ్రెస్ కేరళ ప్రజల అవసరాలను తీర్చడంలో నిరంతరం విఫలమయ్యాయి. అయితే, మా బీజేపీ బృందం ఇప్పటికే వికసిత్ తిరువనంతపురం కోసం పనిచేయడం ప్రారంభించింది. నగర ప్రజలకు నేను చెప్పేది ఒక్కటే. మాపై నమ్మకం ఉంచండి, చాలా కాలంగా రావాల్సిన మార్పును తీసుకొస్తున్నాం. తిరువనంతపురం యావత్ దేశానికి ఒక ఆదర్శ నగరంగా మారుతుంది. తిరువనంతపురాన్ని దేశంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా మార్చడానికి నేను నా పూర్తి మద్దతును అందిస్తాను." అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యం వైపు యావత్ దేశం సమష్టిగా పనిచేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో మన నగరాలు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పట్టణ పేద కుటుంబాల కోసం కూడా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద దేశంలో 4 కోట్లకు పైగా ఇళ్లు నిర్మించి పేదలకు అందజేశామని తెలిపారు. వీటిలో కోటి కంటే ఎక్కువ ఇళ్లు పట్టణ పేదల కోసం నిర్మించామని చెప్పారు. కేరళలోని పట్టణ పేదలే సుమారు 1.25 లక్షల పక్కా ఇళ్లను పొందారని పేర్కొన్నారు.

"ఈ రోజు కేరళ అభివృద్ధి కోసం కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు కొత్త ఊపు లభించింది. ఈ రోజు నుంచి కేరళ రైలు కనెక్టివిటీ మరింత బలోపేతం అయింది. తిరువనంతపురాన్ని దేశంలో ఒక ప్రధాన స్టార్టప్ హబ్‌గా మార్చడానికి గణనీయమైన ప్రయత్నాలు జరిగాయి. కేరళ నుంచే దేశవ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం ఒక కార్యక్రమం ప్రారంభించాం. ఈ రోజు పీఎం స్వనిధి క్రెడిట్ కార్డు ప్రారంభించాం. దీనివల్ల దేశవ్యాప్తంగా వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుంది" అని మోదీ అన్నారు.

**నాలుగు రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కేరళలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతీయ రైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి సహాయపడే మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను, త్రిస్సూర్-గురువాయూర్ ప్యాసింజర్ రైలును, పూజప్పుర హెడ్ పోస్ట్ ఆఫీస్‌ను ప్రారంభించారు. అలాగే సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్టీ ఇన్నోవేషన్, టెక్నాలజీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ హబ్, శ్రీ చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో అత్యాధునిక రేడియోసర్జరీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అలాగే పీఎం స్వనిధి క్రెడిట్ కార్డును ప్రారంభించారు. ఈ క్రమంలో కొందరు లబ్దిదారులకు క్రెడిట్ కార్డులను పంపిణీ చేశారు.

# సిట్ విచారణకు కేటీఆర్... 7 గంటల పాటు విచారణ

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు. అక్రమ, అనైతిక పనులను తాను ఎన్నడూ చేయలేదన్నారు. అధికారపార్టీవారు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని, దిక్కుమాలిన వార్తలతో తనను క్షోభకు గురిచేశారని కేటీఆర్ ఆరోపించారు. నిబద్ధతతో పనిచేసినందునే తాను ఎవరికీ భయపడనని వివరించారు. ఇవాళ విచారణకు వెళ్తా తమ ప్రభుత్వం ఏం తప్పు చేసిందని తానే అడుగుతానని వివరించారు. లీకుల రూపంలో వ్యక్తిత్వ హననం జరుగుతోందని వాటిపైనా ప్రశ్నిస్తానన్నారు. తన పరువుకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యులో చెప్పాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు.

"రాష్ట్రంలో ఇప్పుడు ఫోన్లు ట్యాపింగ్ కావట్లేదని చెప్పే ధైర్యం ఎవరికైనా ఉందా? ప్రభుత్వాలను అస్థిరపరచాలనే కుట్రలను నిరోధించడానికి పోలీసు వ్యవస్థ తన పని తాను చేస్తుంది. ఫోన్ ట్యాపింగ్ అంటూ ఒక సీరియల్ మాదిరిగా రెండేళ్లనుంచి నడిపిస్తున్నారు. విచారణ పేరుతో ప్రభుత్వం నాటకాలాడుతోంది. నేను డ్రగ్స్ తీసుకుంటానని, హీరోయిన్లతో అంటూ అప్పుడప్పుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. విచారణల పేరుతో కాలయాపన పనులే తప్ప, ఒరిగేదేమీ ఉండదు. దొరికిన దొంగలకు ఊరంతా దొంగల మాదిరిగా కనిపిస్తుంటారు. తప్పు చేయనోళ్లు ఎప్పటికీ భయపడరు"-కేటీఆర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

**ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తా :** అందినకాడికి దోచుకునే ముఠా ఇవాళ రాష్ట్రంలో ఉందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తన పరువుకు భంగం కలిగించిన రేవంత్, ఆయన తొత్తులను కూడా వదిలిపెట్టనన్నారు. తనపై లేనిపోని లింకులు అంటగట్టి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపుతూనే ఉంటామన్న ఆయన, హామీలిచ్చి నెరవేర్చకపోతే ఎండగడుతూనే ఉంటామన్నారు. కేసీఆర్‌ను తిరిగి సీఎంను చేసేవరకు సమష్టిగా పని చేస్తామన్నారు.

**రాజకీయ డ్రామా ఆడుతున్నారు :** ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం బీఆర్ఎస్‌ది అని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నికేసులు పెట్టినా భయపడలేదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అప్పుడే తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి తప్పూ చేయలేదని వివరించారు. రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని కేటీఆర్ విమర్శించారు. విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. కేసుల విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపినందుకే విచారణకు పిలుస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు తమతో మాట్లాడేందుకు భయపడుతున్నారని కేటీఆర్ అన్నారు.

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు :** మరోవైపు కేటీఆర్ విచారణ జరుగుతుండగా బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు జూబ్లీహిల్స్ పీఎస్ వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# బిఆర్ఎస్ నేతలతో కెటిఆర్, హరీష్ భేటీ

**సిట్ విచారణపై పార్టీ నేతలతో సమాలోచనలు**

**ఓటుకు నోటు దొంగ సిఎం కావడంతోనే వేధింపులన్న కెటిఆర్**

**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

సిట్ కార్యాలయానికి వెళ్ళేముందు తెలంగాణ భవన్ లోపల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయిన కేటీఆర్, హరీష్ రావు లు..భేటీ అయ్యారు. ఆతర్వాత కేటీఆర్ మీడియా తో మాట్లాడారు. ఈ కేసులో ఏమీ లేదు. మాకు ఏం సంబంధం లేదని కేటీఆర్ తెలిపారు. పదిసార్లు పిలిచినా హాజరవుతా.. అటెన్షన్ డైవర్షన్ కోసమే ఈ కుట్రలు అని మండిపడ్డారు. రేవంత్.. తన మంత్రులతో సహా మా అందరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు. రూ.50 లక్షలతో నోటుకు ఓటులో దొరికిన ఒక దొంగ ఇవాళ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే.. ఈ రాజకీయ కక్ష సాధింపులు అని అన్నారు. 6 గ్యారెంటీల మోసం, 420 హామీల దగా, సింగరేణి బొగ్గు కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ కుతంత్రాలు అయ్యారు. నాలుగు కోట్ల ప్రజలను నయవంచన చేసిన ముఖ్యమంత్రిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ ను బొంద పెట్టేదాకా నిద్రపోం అని కేటీఆర్ తెలిపారు. విచారణలో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతామని వెల్లడించారు. ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది.. కెసిఆర్ సైనికులు గా ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం బీఆర్ఎస్ ది అని అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో పదేళ్లు అధికారంలో ఉన్నాము. మేము ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు.. మేము టైం పాస్ రాజకీయాలు చేయలేదు.. ప్రతిపక్షాలను వేధించ లేదన్నారు. విచారణ లకు భయపడే వారు ఎవరూ లేరని తెలిపారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయి లాగా మారిందని ఎద్దేవ చేశారు. రోజుకో అంశం తో డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. పుట్టిన భూమి సాక్షిగా అక్రమ, అనైతిక పనులు నేను చేయలేదు. నేను డ్రగ్స్ తీసుకుంటానని.. నాకు హీరోయిన్ లతో సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేశారన్నారు. మా కుటుంబాలను ఇబ్బంది పెట్టారు.. అయినా నేను ఎప్పుడూ భయపడలేదు.. హీరోయిన్ ల ఫోన్ లు ట్యాప్ అయ్యాయని మీరే లీకులు ఇచ్చారు.. మళ్ళీ ఏమి లేదని మీరే అన్నారు. ఈ రాష్ట్రంలో ఇప్పుడు ఫోన్ లు ట్యాప్ అవ్వడం లేదని పోలీసులు చెబుతారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విషయంపై డీజీపీ శివదర్ రెడ్డి మీడియా ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బొగ్గు స్కాం ను హరీష్ రావు బయట పెట్టారు.. మంత్రులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదు.. హరీష్ రావు కు నోటీసులు ఇచ్చి పిలిస్తే.. వాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో అలా చెప్పాడని తెలిపారు. రాష్ట్రంలో దోపిడి దొంగల ముఠా ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో కొందరు పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

# సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

మొదటి పేజీ తరువాయి...

మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ఎన్నికలంటే డబ్బులు, ప్రలోభాలు ఉండాలనే విధంగా బీఆర్ఎస్ తయారు చేసింది. మీరు చేసిన పాపాలు, తప్పిదాలపై మరో ఐదేళ్లు విచారణ చేసినా సమయం సరిపోదు. డ్రోన్ కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపారు. ప్రొఫెసర్ కొదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేశారు. మేమెప్పుడూ రాజకీయ క్షక్ష సాధింపునకు పాల్పడలేదు. సిట్ అధికారులు, పోలీసులను కేటీఆర్ బెదిరిస్తున్నారు. అనైతిక రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు.

**కేటీఆర్, హరీశ్‌పై బల్మూరి వెంకట్ ఫిర్యాదు**

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ సందర్భంగా పోలీసు అధికారులను వారిద్దరు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# అమెరికా మరో సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి...

అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు తెలిపింది. అయితే ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి తప్పుకుంటున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమమేమీ లేదన్నారు. దీంతో ఇక్కడ ఘర్షణ తప్పేట్లు లేదు.

# ఫోన్ ట్యాపింగ్ సర్వసాధారణం

మొదటి పేజీ తరువాయి...

సిట్ వేయడమే చట్ట వ్యతిరేకమని అన్నారు. కానీ 380 సాక్షులను విచారించారని మండిపడ్డారు. కానిస్టేబుళ్లు, హోంగార్డులను బలవంతంగా విచారించినట్లు తెలిసిందని అన్నారు. వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ వేశారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌కు పోలీసులకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ఆ విషయం డీజీపీ, సీపీ సజ్జనార్‌కు కూడా తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రక్రియ గోప్యంగా జరుగుతుందని తెలిపారు. హోంమంత్రి, సీనియర్ ఐపీఎస్‌లకు కూడా ఎస్ఐబీ ఎక్కడ ఉంటుందో తెలియదని అన్నారు. ఫలానా విధంగా సమాచారం సేకరించినట్లు ప్రధాని, ముఖ్యమంత్రికి కూడా చెప్పరని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు సజ్జనార్ విచారణ ఎదుర్కొంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆ రోజు నోటుకు ఓటు కేసులో సజ్జనార్ ఫోన్ ట్యాపింగ్ చేశాడని కేసులు పెట్టారని అన్నారు. ఇప్పుడు అదే సజ్జనార్ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ చేస్తా అంటున్నాడని అన్నారు. రాజకీయ నాయకులను వేధించడానికి ఏర్పాటు చేసిన సిట్‌కు సజ్జనార్ చీఫ్‌గా ఉన్నాడని తెలిపారు. సజ్జనార్ సిట్‌ను లీడ్ చేసి, ట్యాపింగ్ వ్యవహారాన్ని విచారించే నైతిక అర్హత లేదన్నారు. రూ.50లక్షలతో దొరికినప్పుడు సీఐడీ డీసీపీగా కూడా సజ్జనార్ ఉన్నారని.. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఉన్నాడన్నారు. ఆనాడు సజ్జనార్, ఇంకా కొంతమంది అధికారులు తమ ఫోన్లు ట్యాప్ చేశారని ఏపీలో కేసులు ఉన్నాయని తెలిపారు. ఏ అర్హతతో ట్యాపింగ్ విచారణ చేస్తున్నారో చెప్పాలని సజ్జనార్‌ను డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్‌రావుపై పెట్టిన కేసు చెల్లదని సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. అయినప్పటికీ ఆయన్ను సిట్ విచారణకు పిలిచిందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ తప్పు కాదని రేవంత్ రెడ్డినే గతంలో చెప్పాడు అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ దేశ రక్షణ కోసం పోలీసులు చేస్తారు. ఫోన్ ట్యాప్ చేయడం నేరం కాదని.. దేశ రక్షణ కోసం ట్యాపింగ్ చేయవచ్చని నాడు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ చెప్పిన వీడియోని చూపించారు. మరి ఈ రోజు ఇదే ముఖ్యమంత్రి బీఆర్ఎస్ నేతలపై ట్యాపింగ్ మీద కేసులు పెడుతున్నాడని విమర్శించారు. అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తాయి. కానీ దీని మీద ఏ రాష్ట్రంలో కూడా చర్చ జరగడం లేదని దేశ భద్రత రీత్యా ఫోన్ ట్యాపింగ్ నేరం కాదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కేటీఆర్‌ను ఏమీ చేయలేరన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అత్యంత గోప్యంగా జరగాల్సిన విషయమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కానీ దాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బజారున పడేసిందని మండిపడ్డారు. తెలంగాణలోని సంపదను పక్క రాష్ట్రాలు దోచుకుంటున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ నేతల దోపిడీని, అవినీతిని బీఆర్ఎస్ అడ్డుకుంటుందని అన్నారు. తెలంగాణ రక్షణ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వీరోచిత పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. నైనీ బొగ్గు గని దోపిడీని బీఆర్ఎస్ అడ్డుకుందని తెలిపారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతుందని అన్నారు. ఫార్ములా ఈ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులు పెట్టారని అన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసులతో వేధిస్తున్నారని తెలిపారు. కేటీఆర్‌కు సంబంధం లేని కేసులో విచారణకు పిలిచారని అన్నారు. కేటీఆర్‌ను విచారణకు పిలవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# రియల్ ఎస్టేట్ అడ్డాలో కార్పొరేషన్ కురుక్షేత్రం

మొదటి పేజీ తరువాయి...

డ్రైనేజీ లీకేజీలు, తాగునీటి ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతుంటే, కార్పొరేటర్లు మాత్రం కాంట్రాక్టులు,

సెటిల్‌మెంట్లలో బిజీగా ఉన్నారనే అసంతృప్తి క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.

**పెరిగిన డివిజన్లు పెరిగిన ఆశావహులు**

ఒకప్పుడు కేవలం 7 డివిజన్లుగా ఉన్న శేరిలింగంపల్లి ప్రాంతం, నియోజకవర్గ పునర్విభజన విస్తరణ తర్వాత ఇప్పుడు 18 డివిజన్లుగా రూపాంతరం చెందింది. డివిజన్ల సంఖ్య పెరగడంతో ప్రతి పార్టీలోనూ పోటీదారుల సంఖ్య అమాంతం పెరిగింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ.. ఇలా ప్రధాన పార్టీల నుంచి ఒక్కో డివిజన్‌కు డజనుకు పైగా అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరపడిన వారు, రాజకీయాల్లోకి వస్తే తమ వ్యాపారాలకు రక్షణ ఉంటుందని, భవిష్యత్తులో మరింత సంపాదించవచ్చనే ఆలోచనతో కోట్లు ఖర్చు పెట్టడానికైనా సిద్ధపడుతున్నారు.

1. కాంగ్రెస్: రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో సహజంగానే ఆశావహుల రద్దీ ఎక్కువగా ఉంది. దానిఃఇ తడు టీఆరెఎస్ నుండి గెలిచిన కార్పొరేటర్ల ఆందరు కాంగ్రెస్ పార్టీ చేరడం వలన ప్రస్తుతం వీరిపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉంది. అయినప్పటికీ అధికార పార్టీ అండదండతో గట్టెక్కి వచ్చాని అగ్రనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, తామే గెలుపు గుర్రాలమని ప్రచారం చేసుకుంటున్నారు.

2. బీఆర్ఎస్ : పార్టీ నుండి గెలిచిన కార్పొరేటర్లు వసూళ్లకు పాల్పడితే కేసులు అవుతాయని చాలా మంది కాంగ్రెస్ పార్టీలోకి జంపు చేశారు. టిఆర్ఎస్ నుంచి పోటీ చేసే నాయకులు అందరు ద్వితీయ శ్రేణి నాయకులు కావడం వలన ఎలాంటి అవినీతి మచ్చ లేకపోవడంతో తాము ఈజీగా గెలుస్తామని ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు.

3. బిజెపి: ఐటీ ఉద్యోగులు ఉత్తరాది ఓటర్లు ఎక్కువగా ఉన్న డివిజన్లలో బీజేపీ జెండా ఎగురవేయాలని ప్రణాళికలు రచిస్తోంది.

గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, ఇక్కడ రాజకీయం ఎంత సంక్లిష్టంగా ఉందో అర్థమవుతుంది. కొన్ని డివిజన్ ల పరిధిలో ఇద్దరు ముగ్గురు పాత ప్రజాప్రతినిధులు ఉండటం విశేషం. ఇది ఓట్ల చీలికకు దారితీసే అవకాశం ఉంది.

డబ్బు, మద్యం, అధికార బలంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవచ్చని అభ్యర్థులు భావిస్తున్నప్పటికీ, చైతన్యవంతులైన శేరిలింగంపల్లి ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి. ముఖ్యంగా గడిచిన ఐదేళ్లలో కేవలం సొంత లాభం చూసుకున్న వారికి ఈసారి ప్రజలు బుద్ధి చెప్పే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# శ్రీసరస్వతీ పూజకు అత్యంత విశిష్టమైన ప్రాధాన్యత ఉంది: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మల్లాపూర్ డివిజన్ ) జనవరి 23 ( ప్రభాత ఉదయం ):**




సరస్వతి దేవి పూజకు అత్యంత విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా మల్లాపూర్ బంగీయ సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని విఎన్ఆర్ గార్డెన్ హాల్‌ఉ2లో సరస్వతి దేవి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి దేవి పూజకు అత్యంత విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నదని అన్నారు. విద్య, విజ్ఞానం, సంస్కృతి పరిరక్షణలో సరస్వతి పూజకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ గౌడ్, మల్లాపూర్ బంగీయ సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జాగో భాగ్యనగర్ చలో బాలాపూర్ ధర్మరక్షణ సభ విజయవంతం చేయాలి : వై శ్రీధర్

**బుద్వేల్, జనవరి 23 (ప్రభాత ఉదయం) :**

రోహింగ్య లను వారి దేశానికి పంపించాలని ఈ నెల 24 న నిర్వహించనున్న చలో బాలాపూర్ సమావేశానికి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ వై శ్రీధర్ కోరారు. మైలార్ దేవ్ పల్లి బీజేపీ పార్టీ ఆఫీస్ లో బీజేపీ నాయకులు జనార్దన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వై శ్రీధర్ మాట్లాడుతూ, విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరం అక్రమ చొరబాటుదారుల కారణంగా భవిష్యత్ లో తీవ్రమైన భద్రతా సవాళ్లను ఎదుర్కొంటోందని. ఈ బంగ్లాదేశీ మరియు రోహింగ్యా అక్రమ వలసదారులు నగరంలో స్థిరపడడం వల్ల జనాభా సమతుల్యత, సామాజిక శాంతి, జాతీయ భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతోందని అన్నారు. అక్రమంగా ఆధార్, ఓటర్ కార్డులు సంపాదించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు చేశారు. రక్షణ రంగానికి సంబంధించిన డీఆర్‌డీఎల్, ఆర్‌సీఐ వంటి కీలక సంస్థల చుట్టుపక్కల అక్రమ కాలనీలు విస్తరిస్తుండటం దేశ భద్రతకు ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. యువత మత్తుపదార్థాలకు అలవాటు పడేలా చేసే నెట్‌వర్కులు, సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే చర్యలపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజంలో ఐక్యత అవసరమని ప్రజలు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో నిర్వహిస్తున్న 'ధర్మ రక్షణ సభ'కు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆందోళన స్పష్టంగా వ్యక్తం చేయాలని



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్

పిలుపునిచ్చారు. బీజేపీ సీనియరు నాయకులు జోగి రవి , ధర్మరక్షణ సభ మెయిలర్ దేవుపల్లి కన్వీనర్ బొమ్మరాజు నరసింహ ,బీజేపీ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ చేదం వెంకటరమణ గుప్తా,బీజేపీ నాయకులు సంతోష్ గౌడ్ , బీజేపీ నాయకులు మన్ మోహన్ రెడ్డి ,నర్సీ రెడ్డి ,మధుసూదన్ రెడ్డి ,ఉడుత లక్ష్మి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



హైదర్ గూడ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

# ఘనంగా పరాక్రమ దివస్... నేతాజీకి నివాళి..

**బుద్వేల్, జనవరి 23 (ప్రభాత ఉదయం) :**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా శుక్రవారం హైదర్ గూడ లో పరాక్రమ దివస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అత్తాపూర్ కార్పొరేటర్ ఎం సంగీత ముఖ్యఅతిథిగా హాజరై సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ పరాక్రమ దివాస్ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, వై శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, ఎం కొమురయ్య, జయానంద్ రెడ్డి, చెట్టి గారి నరేందర్, ప్రణవభక్త సమాజం అధ్యక్షులు ఎం నరసింహ, సామాజిక కార్యకర్త మ్యాడమ్ మధుసూదన్, కాడెం సుధాకర్ , సహదేవ రెడ్డి రమేష్ , కె.సుధాకర్ రెడ్డి వరదరాజు రెడ్డి , సోమారం రవీందర్ , సోమారం రాజ్ కుమార్, బొక్క బాల్ రెడ్డి మహేందర్ , ఐలయ్య , ఎస్ బీ హరి నాథ్, అశోక్ , విజయ్, జగన్ , హరినాథ్ నేతాజీ యువజన సంఘ నాయకులు రాజేందర్ ధనంజయ హనుమంత్ రెడ్డి శ్రీశైలం శ్రీనివాస్ శేఖర్ కమలేకర్ రాజు కిట్టు అజయ్ గౌతమ్ బాలకృష్ణ సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదర్గూడా నుంచి జనప్రియ వరకు 2ని రన్ జరిగింది. రెండు కిలోమీటర్ల వరకు జరిగిన ఈ రన్ లో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మీ తో మాట్లాడుతున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి

## ఉప్పర్ పల్లి వాంబే కాలనీలో తాగు నీటి సరఫరాను మెరుగు పరచాలి: పోరెడ్డి ధర్మారెడ్డి

**బుద్వేల్, జనవరి 23 (ప్రభాత ఉదయం) :**

ఉప్పర్ పల్లి వాంబే కాలనీలో ఉన్న తాగునీటి సమస్య ను పరిష్కరించాలని బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన వాంబే కాలనీ వాసులతో కలిసి బుద్వేల్ లో గల రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మి ని కలసి వాంబే కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను వివరించారు. రెండు మూడు సంవత్సరాలు నుండి వాంబే కాలనీ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నన్నారు . వాంబే కాలనీ ప్రజల నీటి సమస్యలను తీర్చాలన్నారు. లేనట్లయితే వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కే గిరిబాబు, ఉదయ్ కిరణ్ రెడ్డి, యాదగిరి, అరవింద్ అకిరా నందన్ అలాగే బాంబే కాలనీవాసులు పాల్గొన్నారు

## ఈనెల 25న రాష్ట్ర లింగ బలిజ సంఘం ప్రమాణ స్వీకారం

**గద్వాల ప్రతినిధి,జనవరి23(ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ లోని వీరశైవ లింగాయత్ బసవ భవన్ కోకాపేట వద్ద ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సురేష్, ఆనంద్ గౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగ బలిజ కులానికి ఓబీసీ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న కమిటీ రాష్ట్ర, జిల్లా పదాధికారుల ప్రమాణ స్వీకారంతో పాటు నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ విడుదల ఉంటుందన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, ఉప సర్పంచు, వార్డు సభ్యులుగా ఎన్నికైన కుల బాంధవులకు సన్మానం ఉంటుందన్నారు. జిల్లాలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజ కుల బాంధవులు పెద్దసంఖ్యలో కార్య క్రమానికి హాజరు కావాలని కోరారు.



నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతున్న పెండ్యాల చంద్రమోహన్

## శివరాంపల్లిలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**బుద్వేల్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

శివరాంపల్లి నేతాజీ యువజన సంఘం ప్రాంగణంలో శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు సదాల సందీప్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ మల్లెల సూర్య చరణ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ సాంబ జగదీష్ లు పాల్గొన్నారు. సరస్వతీ శిశు మందిర్ శివరాంపల్లి పాఠశాల అధ్యక్షులు పెండ్యాల చంద్రమోహన్ , కార్యదర్శి గొట్టె అనిల్ , కోశాధికారి షీలా సంతోష , పాఠశాల ప్రధానాచార్యులు కావలి శ్రీనివాస్ , ఆచార్య బృందము విద్యార్థులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా పెండాల చంద్రమోహన్ మాట్లాడుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ గొప్ప స్వాతంత్ర సమరయోధుడు అని కొనియాడారు. త్యాగశీలి అజాద్ హింద్ ఫౌజ్ సాయుధ పోరాట దళాన్ని స్థాపించిన మహా గొప్ప వీరుడని కొనియాడారు

## రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు దుర్మరణం

**రాజేంద్రనగర్, జనవరి 23 (ప్రభాత ఉదయం) :**

కాటేదాన్ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న కిష్టమ్మ (76) అనే వృద్ధురాలిని కారుతో ఢీ కొట్టిన సంఘటన గురువారం మధ్యానం జరిగింది. మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి లక్ష్మీగూడ ప్రాంతానికి చెందిన కిష్టమ్మ గురువారం మధ్యాహ్నం కూరగాయల కోసం ఇంటి నుండి బయలుదేరి వెళుతున్న సమయంలో కారు ఢీ కొట్టింది . దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి . స్థానికులు 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కారు డ్రైవర్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు



కిష్టమ్మ

## గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

**బుద్వేల్, జనవరి 23(ప్రభాత ఉదయం) :**

తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యా శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలకు మరియు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న (బ్యాక్లాగ్) సీట్ల భర్తీకి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించినట్లు హైదరాబాద్ మరియు రంగారెడ్డి రీజియన్ రీజనల్ కో ఆర్డినేటర్ కె . నాగార్జున రావు ఓ ప్రకటనలో తెలిపారు. గడువు పొడిగింపు: దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీని 2026 జనవరి 21 నుండి జనవరి 25 వరకు పెంచడం జరిగిందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సమీపంలోని మీ-సేవ కేంద్రాల ద్వారా లేదా అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026 ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఇంగ్లీష్ మీడియం బోధన అందించే ఈ గురుకులాల్లో చేరాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్ సైట్ ను ‘స్త్రషెవ్.వశ్రీఖఅస్త్రుఖఖ.స్త్రశీజ.ఱఅ . చూడాలని హైదరాబాద్ మరియు రంగారెడ్డి రీజియన్ రీజినల్ కో ఆర్డినేటర్ కె నాగార్జున రావు తెలిపారు.

## లక్ష్మిగూడ రాజీవ్ గృహకల్పలో మురుగు నీరు వెళ్ళడానికి తాత్కాలికంగా పనులు

**బుద్వేల్, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

సంవత్సర కాలం నుంచి లక్ష్మిగూడ రాజీవ్ గృహ కల్ప కాలనీ వాసులు మురుగు నీటి సమస్యతో బాధ పడుతున్నారు ఈ సమస్య ను పరిష్కరించాలని పలు మార్లు స్థానికులు రాజకీయ పార్టీల నాయకుల చుట్టూ తిరిగిన ఫలితం కనిపించలేదు. ఇదే విషయాన్ని స్థానిక నాయకుడు గుమ్మడి కుమార్ ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభాత ఉదయం లో మురుగు నీటి కి సంబంధించిన అంశం ప్రచురితం కావడంతో స్పందించిన జలమండలి అధికారులు రాజీవ్ గృహ కల్ప కాలనీ లో మురుగు నీటి సమస్య పరిష్కారానికి తాత్కాలిక పరిష్కారం గా కాలువ తవ్వుతున్నారు.



లక్ష్మిగూడ రాజీవ్ గృహ కల్ప లో మురుగు నీరు వెళ్ళడానికి తాత్కాలికంగా కాలువ తీస్తున్న జలమండలి అధికారులు

# రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

**బుద్వేల్, జనవరి 23(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్ - టీచర్స్ - విద్యార్థుల సమావేశం నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సంచాలకులు శ్రీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి ఆధ్వర్యంలో జరిగింది . చదువు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ విద్యార్థుల సక్సెస్ స్టోరీస్,యోగ, విద్యార్థుల పురోగతిని వివరించేందుకు సలహాలు స్వీకరించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులను కళాశాలకు ఆహ్వానించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల




రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పేరెంట్ - టీచర్స్ - విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు

ప్రిన్సిపాల్ సుధారాణి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్తు మార్గాలను వారి జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి అవ లింబవలిసిన పద్ధతులను తెలియ చేశారు. విద్యార్థుల పురోగతి తల్లిదండ్రులు అధ్యాపకుల పాత్ర తదితర అంశాలపై ప్రసంగం ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ఉచిత ఆన్లైన్ తరగతుల నిర్వాహణ, సీసీ కెమెరాలు ఏర్పాటు ముఖ గుర్తింపు హాజరు,డిజిటల్ బోర్డ్ లో నిర్వహణ,ఆహ్లాదకరమైన ప్రయోగశాలలు మొదలైన కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల ప్రగతి హాజరు ప్రవర్తన నియమావళి అంశాలను బోధకుల నుంచి సమాచారం సేకరణ చేసి విద్యార్థుల ప్రగతికి తోడ్పడుతున్న కళాశాలను ప్రశంసించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొనడం జరిగింది.

ప్రభాత ఉదయం

## విద్యార్థుల ప్రగతి కొరకు

# విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలి

గద్వాల ప్రతినిధి:



విద్యార్థుల ప్రగతి కొరకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అద్యాపకుల అత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అధ్యాపకుల పాత్ర ఎంత ముఖ్యమో తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే ముఖ్యం అని ఇద్దరి కృషితో విద్యార్థుల జీవితం మెరుగుపడుతోందన్నారు. కళాశాలకు తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాలకు హాజరవుతూ విద్యార్థి ప్రగతిని తెలుసుకుంటూ వారి యొక్క విద్యాభివృద్ధి గురించి తెలుసుకోవాలని అధ్యాపకులు ఇచ్చిన సలహా సూచనలు పాటిస్తూ వారి ప్రగతి కొరకు కృషి చేయాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కళాశాలలోని నేను కూడా విద్యను అభ్యసించానని గుర్తు చేశారు. మీకు ఏ సమస్య ఉన్నా దానికి చదువే పరిష్కారం అని, అలాగే మీరు ఎంచుకున్నటువంటి స్నేహితులు అత్యంత మంచి వారై ఉండాలని, పేరెంట్స్ మాట వినాలని, మీకు మీరే సొంతంగా జీవితం గురించి అవగాహన కలిగి ఉండాలని ఆ టెంపో ను జీవితంలో స్థిరపడేంతవరకు కొనసాగించాలని సూచించారు. అధ్యాపకులతో పెద్దవాళ్లతో మంచి సంబంధాలు ఎల్లప్పుడూ కలిగి ఉండాలని తెలిపారు. ఈ కళాశాలలో ప్రతి విద్యార్థి అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ఇస్తున్న డిజిటల్ బోర్డ్స్, ఉచిత పుస్తకాల పంపిణీ, ఉచిత ప్రవేశాలు, స్కాలర్ షిప్ లు పేద విద్యార్థులకు ఉపయోగపడతాయని వాటిని సద్విని చేసుకోవాలని సూచించారు. గతంలో కన్నా ఇప్పుడు పోలుస్తుంటే ప్రతి ఒక్క విద్యార్థి చదువులో రాణిస్తున్నారని, ఇటీవలే ఎంబిబిఎస్ ఫలితాలలో గట్టు మండలంలోని 8 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లను సాధించారన్నారు. గద్వాల ప్రాంతం నుండి 18 మంది ఎంబిబిఎస్ సీట్లను సాధించడం జరిగిందని చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా పోలీస్ కానిస్టేబుల్, ఉపాధ్యాయ రంగంలో ఉద్యోగాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎం. హృదయ రాజు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఇస్తున్న పథకాల ద్వారా విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని ప్రభుత్వం ఇస్తున్న సదుపాయాలకు కళాశాల భవనాలు అందంగా తయారవుతున్నాయని అన్నారు. గద్వాలలో ప్రవేట్ కళాశాలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులు 74% ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి విద్యార్థికి చదువుతోపాటు యోగా, క్రీడలపై శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో కళాశాలలో షెడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో ఈ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు సాధించడం జరిగిందని, అదే విధంగా కొంతమంది విద్యార్థులు పోలీస్ కానిస్టేబుల్ గ్రూప్-4 , టీచర్స్, లెక్చరర్స్, ఉద్యోగాలు సాధించారన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు నీట్, ఎంసెట్ లాంటి ప్రదేశాలకు సన్నద్ధం చేస్తున్నామని కనుక ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు తమ యొక్క పిల్లలను ప్రభుత్వం జూనియర్ కళాశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ వీరన్న మాట్లాడుతూ గద్వాల జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ మంచి ఫలితాలు సాధించాలని అందుకు తల్లిదండ్రుల యొక్క పాత్ర కీలకమైందన్నారు. ప్రతి విద్యార్థి పేరెంటు తమ యొక్క విద్యార్థులు తమ యొక్క పిల్లలను ప్రతిరోజు కళాశాలకు పంపే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కళాశాలకు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారం మరువలేనిది అని రాష్ట్రంలోనే ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఈ కళాశాలను తీర్చిదిద్దుతున్నారని సభలో అభినందించారు. ఏజీఎంసీ బండ్ల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి ప్రగతికి అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషి చేస్తే ఫలితాలు చాలా చక్కగా వస్తాయని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ యొక్క పిల్లలను అధ్యాపకులతో పాటు వారు కూడా ఇంట్లో చదివిస్తూ తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో తల్లిదండ్రులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇంటర్మీడియట్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, అద్యాపక బృందం సృజన, గీతా, బోరవెల్లి పవన్ కుమార్, గండి చెరువు శేఖర్, కలీముల్లా, శేఖర్ నాయక్, సుతారి గోపి, సి బాలకృష్ణ, మల్లికార్జున్ , రవిశంకర్, బాలకృష్ణ, శిరీష, వీరేశం, వెంకటేష్, అంజనమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.






## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును

# సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల ప్రతినిధి, జనవరి23 (ప్రభాత ఉదయం)

ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటర్ గా తమ పేరు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 25న 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా అధికారులు, సిబ్బందితో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, స్వీప్ నోడల్ అధికారి రమేష్ బాబు ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు, ఆయా ఎన్నికల్లో అత్యధిక ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు జాతీయ ఎన్నికల సంఘం 2011 నుంచి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అందరికీ ఆమోదయోగ్యమైన, ఎక్కువ మంది ఆదరణను పొందిన పాలకులను మన ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునేందుకు ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి గతంలో ప్రజలకు చాలా తక్కువగా అవగాహన ఉండేదని, ప్రస్తుతం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నందున ప్రతి పౌరుడు ఓటు విశిష్టతను తెలుసుకొనేందుకు అవకాశం కలిగిందన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మీ సేవ కేంద్రాలు తనిఖీ

గద్వాల ప్రతినిధి, జనవరి23 (ప్రభాత ఉదయం)

ధరూరు మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను, శాశ్వత ఆధార్ సెంటర్ ను శుక్రవారం ఈ డిస్టిక్ మేనేజర్ శివ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీ సేవ కేంద్రం ద్వారా నిర్వహణ పరిశుభ్రత సాంకేతిక వసతులు సిబ్బంది ప్రవర్తన సేవల వేగం వంటి అంశాలను వారు సమగ్రంగా పరిశీలించారు. మీ సేవా కేంద్రాలకు వచ్చే ప్రజల సమర్పిస్తున్న దరఖాస్తులు ముఖ్యంగా ఆదాయ ధ్రుపత్రాలు, కుల ధృవపత్రాలు, రేషన్ కార్డు, జననం, మరణ ధ్రువపత్రాలు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు వాటి ప్రోజెడింగ్ స్థితిని తనిఖీ చేశారు. మీసేవ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. సేవలకు సంబంధించిన రుసుములు వివరాలు కేంద్రాలలో స్పష్టంగా ప్రదర్శించేలా ఉండాలన్నారు. అధిక రసములు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారదర్శకత్వంతో సేవలు అందించాలని ప్రతి వినియోగదారినితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం శాశ్వత ఆధార్ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయన వెంటా డిఎం సుధాకర్, మీసేవ కేంద్ర నిర్వాహకులు తదితరులు ఉన్నారు.




## ఘనంగా వసంత పంచమి వేడుకలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం)

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్లో వసంత పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జయ శ్రీ ఆధ్వర్యంలో సరస్వతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది చిన్నారులకు వారి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ఆమె తెలిపారు.



## జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే దంపతులు

గద్వాల ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం) మాఘమాసం వసంత పంచమిని పురస్కరించుకుని గద్వాల పట్టణ పరిధిలో గల జమ్మిచేడు శ్రీజమ్ములమ్మ, పరశురాముడు స్వామి ఆలయాని శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా జమ్ములమ్మ అమ్మవారికి, పరుశరామ స్వామి వారికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గద్వాల ఎమ్మెల్యే దంపతులకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని ఆలయం కమిటీ చైర్మన్ వెంకట్రాములు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్, ఆలయం కమిటి డైరెక్టర్ చంద్రశేఖర్, నాయకులు వంట భాస్కర్, తదితరులు ఉన్నారు.



## ఆర్ఎంపీ, పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు

గద్వాల ప్రతినిధి,జనవరి23(ప్రభాత ఉదయం)

జిల్లా కేంద్రంలోని హరిత టూరిజం హోటల్ లో శుక్రవారం ఆర్ఎంపీ, పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్, హైదరాబాద్ వారి సౌజన్యంతో ఆర్ఎంపీ ఎంపీలకు నిర్వహించిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సుకు ప్రముఖ వైద్యులు (మెడికవర్ హాస్పిటల్ – హైదరాబాద్): డాక్టర్ దయ వాస్వని ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ కౌశిక్ యూరాలజిస్ట్ డాక్టర్ మన్నెం మనోజ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకట పవన్ రోబోటిక్ జనరల్ సర్జన్ హజరయ్యారు. ఈ సదస్సులో గుండె వ్యాధులు, యూరాలజీ సమస్యలు, గ్యాస్ట్రో సమస్యలు, ఆధునిక శస్త్రచికిత్సలు మరియు నివారణ చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.విజయ్, జమ్మిచేడు సుదాకర్, రహీం, రాజు, మదు మరియు కార్యవర్గం సభ్యులు, కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.



సోమేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

## శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం):

శ్రీ సోమేశ్వర లక్ష్మి నర్సింహా స్వామి ఆలయం పాలకుర్తి లో శుక్రవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్వామి వారిని దర్శించుకున్నారు. వారికీ ఆలయ అధికారులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికి, తీర్థం ప్రసాదాలు అందచేశారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకం లో భాగం గా... పాలకుర్తి లోని శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఫంక్షన్ హాల్ ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, స్థానిక శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి తో కలిసి ప్రారంభించారు. తరువాత డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించారు. ఈ కార్యక్రమం లో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం)

నడిగడ్డ ప్రజల ఇలవేల్పు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం లోని శ్రీ జములమ్మ ఆలయ కొండి దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరి , ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్.పురేందర్ కుమార్ , యూనియన్ బ్యాంకు మేనేజర్ ,సిబ్బంది గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపు 85 రోజులకు మొత్తం హుండీ ఆదాయం 8,98,646 రూపాయల (ఎనిమిది లక్షల తొంబై ఎనిమిది వేల ఆరు వందల నలభై ఆరు రూపాయలు) ఆదాయం వచ్చినదని హుండీ లెక్కింపు లోవెండి, బంగారం ఏమియు రాలేదని తెలిపారు.

# కల్లు తాగిన కోతుల్లా ప్రవర్తించారు

**కాంగ్రెస్ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నా..**

**మద్యం మత్తులో వచ్చి నా మీద దాడికి ప్రయత్నించారు**

**అభివృద్ధిపై రౌడీయిజం చేశారంటే ఇక ప్రజలు ఊరుకోరు**

**జనగామ ప్రశాంతతను చెడగొట్టే శక్తులను ప్రజలే తిప్పికొడతారు**

**గుండాలతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు**

**రాబోయే ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే**

**ఇటువంటి పిచ్చి పనులు మానుకోండి**


**శాంతి భద్రతకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల రెచ్చగొట్టే ప్రవర్తనను తీవ్రంగా హెచ్చరిస్తున్నా**

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం):**

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ గుండాల తీరు పై తీవ్రంగా మండిపడ్డారు. జనగామ పట్టణంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేగా నాకు ఆహ్వానం వచ్చింది. మా కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లోనే ఉండి, వారికి బొకేలు ఇచ్చి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికామని, కానీ అక్కడ ఉన్న కొంతమంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

కాంగ్రెస్ నాయకులు కావాలనే కొబ్బరి కాయ కొట్టే సమయంలో గందరగోళం సృష్టించారని, కొందరు మద్యం మత్తులో వచ్చి, ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ, కార్యక్రమాన్ని భంగపెట్టే ప్రయత్నం చేశారని, ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.
శుక్రవారం ప్రారంభమైన వెజ్‌ఉనాన్‌వెజ్ మార్కెట్ పనులు 7 కోట్ల వ్యయంతో నాలుగేళ్ల క్రితమే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభ మయ్యాయని, రెండేళ్లుగా పనులు నిలిచిపోయినా నేను ఆరు నెలలుగా వెంటపడి పని చేయిస్తే ఇవాళ పని పూర్తి అయిందన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, మున్సిపాలిటీలో వచ్చిన ఎల్ఆర్ఎస్ నిధుల్లో నుంచి దాదాపు 3 కోట్లు వెచ్చించి బతుకమ్మ కుంటను అభివృద్ధి చేయించమన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వైకుంఠధామానికి నేను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు, కేటీఆర్ గారి సహకారంతో 25 కోట్ల నిధులు మంజూరు చేయించన్నారు. కాంగ్రెస్ నాయకుల అడ్డంకుల వల్ల ఇప్పటికి రూ.19 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు.అందులో భాగంగా దాదాపు 2 కోట్లు వైకుంఠధామానికి, అలాగే నెహ్రూ పార్క్ సమీపంలోని 60 అడుగుల రోడ్డుకు పనులు ఇవాళ పెట్టినమన్నారు.. అయినా కొన్ని కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తూ నా మీద దాడికి కూడా ప్రయత్నించారన్నారు.జనగామకు చెందిన వారు అసలు కాదు. జనగామ ప్రశాంత వాతా వరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గంమన్నారు.మా కార్యకర్తలు, నాయకులు ఎంతో నిదానంగా వ్యవహరించారు. మంత్రి సీతక్కకి అన్ని కార్యక్రమాల్లో గౌరవం ఇచ్చి, శాంతియుతంగా కార్యక్రమాలను పూర్తిచేశాం.జనగామ అభివృద్ధి కోసం గానుపహాడు బ్రిడ్జికి 90 లక్షలు, చిటకోడూరు బ్రిడ్జికి నిధులు, అందె శ్రీ పుట్టిన రెబర్తి ప్రాంతానికి అదనపు నిధులు, మినీ సమ్మక్క, సారలమ్మ జాతరకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని వినతిపత్రాలు అందించామన్నారు.కొమ్మూరి ప్రతాపరెడ్డి కొడుకు ఆధ్వర్యంలో జరిగిన ఈ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. కావాలనే మద్యం తాగించి గొడవలు చేయడం జనగామ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరు.ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా కచ్చితంగా ఎగరేస్తుంది. ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలుకుతున్నాం.జనగామ ప్రజలే మొత్తం చూశారు. ఎవరు రెచ్చగొట్టారో, ఎవరు అభివృద్ధి చేశారో. ప్రజల తీర్పు స్పష్టంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రేమలత రెడ్డి, రమణ రెడ్డి, తిప్పరపు విజయ్, సందీప్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలలో అభివృద్ధి చేసే వారినే ఆశీర్వదించాలి

## ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలి**

**మల్టీ పర్పస్ కమిటీ హాల్ త్వరలోనే నిర్మాణం**

**మల్టీ పల్స్ కమ్యూనిటీ హాల్ ,వివిధ కుల సంఘాల కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే**

**ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎకరంన్నర భూమి కేటాయించి 50 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో అభివృద్ధి చేసే వారినే ఆశీర్వదించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కేంద్రంలోని వ్యాపార సంస్థల్లో వివిధ వృత్తిలో ఉన్న వారికి మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ప్రొసీడింగ్ పత్రాలను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా అసోసియేషన్ అధ్యక్షుడు కార్యవర్గ సభ్యులు అందజేశారు. అదేవిధంగా వివిధ కుల సంఘాలకు కమిటీ హాల్ నిర్మాణాలకు ఎమ్మెల్యే నిధులను కేటాయించి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ...గత ఎన్నికల సమయంలో వివిధ కుల సంఘాలకు, అన్ని వర్గాల అసోసియేషన్ సంఘాలకు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి కమిటీ హాల్ మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దూర దృష్టితో గద్వాల రింగ్ రోడ్డు సమీపంలో ఎకరం 1/2 భూమిని కేటాయించడం జరిగిందన్నారు. మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ లో అన్ని యూనియన్ల కు మంచి హాలు, వసతులతో ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. రెండు



లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ఆయన సతీమణి, మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి

సంవత్సరాలలో పూర్తిచేసే విధంగా నా వంతుగా కృషి చేస్తానని తెలిపారు. మొదటి విడతగా 50 లక్షల రూపాయలు కేటాయించడం జరిగింది త్వరలోనే పనులను ప్రారంభించి అక్కడ వివా వేడుకలు జరుపుకునేలా మూడు కమ్యూనిటీ హాల్లో నిర్మించడం జరుగుతుందన్నారు.రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గద్వాల నియోజకవర్గం ప్రతి గ్రామంలో హిందువులకు దేవాలయం దగ్గర, మసీదు దగ్గర, క్రిష్టియన్ కు చర్చి దగ్గర 225 కమ్యూనిటీ హాల్ ను ఏర్పాటు చేసినట్లుతెలిపారు.గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రతి కుల సంఘానికి కూడా కమిటీ హాల్ నిర్మాణానికి నిధులను కేటాయించడం జరిగింది అని అన్నారు. ఇప్పటికే కొన్ని కుల సంఘాలు కమిటీ హాల్ నిర్మాణము పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు. గద్వాల ప్రాంతం మరింతగా అభివృద్ధి చేసే విధంగా నా వంతు ప్రయత్నం చేయడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు అభివృద్ధికి సహకరించాలని కోరారు. త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో అభివృద్ధి చేసే వారికి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, శ్రీను ముదిరాజ్, తుమ్మల నర్సింహులు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు కురుమన్న, ఆలూరు రామయ్య శెట్టి, సుదర్శన్, ధర్మ నాయుడు,రామాంజనేయులు, దౌలన్న, సంగాల నర్సింహులు, చిరు ముదిరాజ్ ,రంగస్వామి, పవన్ యాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

**ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలి**

**ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో వాహనదారులకు పలు సూచనలు చేసిన సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి**

**కూకట్ పల్లి, జనవరి 23 (ప్రభాత ఉదయం)**



వాహనాలు నడిపేటప్పుడు క్షేమంగా ఇంటికి వెళ్లాలి అంటే తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి అన్నారు. నేడు కూకట్ పల్లి రంగదాముని చెరువు వద్ద కూకట్ పల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన విధానంలో మార్పు రావడం, సరైన నిద్ర లేకపోవడం, తొందరగా వెళ్ళాలి అనే ఆలోచన వల్లే ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. మానవ ప్రాణం ఎంతో విలువైనదని దానిని కాపాడుకోవడం అదేవిధంగా తనపై ఆధారపడి ఉన్న కుటుంబాన్ని రక్షించుకోవడం వారి బాధ్యత అని గుర్తు చేశారు. స్టార్ట్ ఎర్లీ, గో స్లోలీ, రీచ్ సేఫ్లి అనే నినాదాన్ని గుర్తు పెట్టుకొని ప్రయాణాన్ని సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహనాలు నడుపుతూ హెల్మెట్ ధరించని వారికి బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అజయ్ రాయుడు హెల్మెట్స్ అందజేయడంతో ఆయనను అభినందించారు. హెల్మెట్ పెట్టుకుని వాహనాన్ని నడిపితే జుట్టు రాలిపోతుంది అని పెట్టుకోకుండా వెళితే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంది అని అన్నారు. విద్యార్థులు, యువత ఎక్కువగా ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని దీనిని గమనించి ఈ కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జోన్ డిసిపి రీతి రాజ్, మేడ్చల్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రత్నకుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శీను బాబు, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఉత్తమ ఫలితాలు సాధించడమే ముఖ్య లక్ష్యం

**ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాముని పావని కుమారి**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం):**

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శ్రీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మకంచ, జనగామ నందు శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ పేరెంట్స్ తో మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డు ఉచిత విద్య, అడ్మిషన్స్, పాఠ్య పుస్తకాలు, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్స్, అన్ని సౌకర్యాలతో సైన్స్ ల్యాబ్స్, ఆన్లైన్ అటెండన్స్ తల్లితండ్రులకు మెస్సేజ్ లు, విద్యార్థులకు చదువుతో పాటు ఆట స్థలాలు, ఆట వస్తువులు సమాకూర్చడం, యోగ మానసిక వికాస తరగతులు, స్టూడెంట్స్ కౌన్సిలర్స్ ఇలా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నది. కావున ఈ సౌకర్యాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపయోగించుకోని రాబోయే ఎగ్జామ్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించడమే ముఖ్య లక్ష్యం అని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ లెక్చరర్ వేముల శేఖర్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవి ప్రసాద్, విద్యార్థుల తల్లితండ్రులు, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.



వనిత టి స్టాల్ ను ప్రారంభిస్తున్నఅదనపు కలెక్టర్

# రుచికరమైన టీని, పౌష్టికాహారపు చిరు తిళ్లను అమ్మాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం):**

జిల్లా మెప్మా, డిఆర్డిఎ ఆధ్వర్యంలో బతుకమ్మ కుంటలో ఏర్పాటు చేసిన వనితా టీ, స్నాక్స్ స్టాల్ లని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ప్రారంభించారుఈ సందర్భంగా కలెక్టర్రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, పార్క్ కి వచ్చే ప్రజలకు, చిన్నారులకు రుచికరమైన టీ ని, పౌష్టికాహారపు చిరు తిళ్లను అమ్మాలని సూచించారు.రుచికరంతో పాటు .టీ స్టాల్స్ ఎప్పుడు పరిశుభ్రం గా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, స్వయం సహాయక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు



# మహిళలు ఎవరి దగ్గర చేయి చాపకుండా స్వేచ్ఛగా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు

**పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం):**

ఇందిరా మహిళా శక్తి పథకం లో భాగంగా. పాలకుర్తి లోని శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఫంక్షన్ హాల్ ను, డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి సీతక్క.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,స్థానిక శాసనసభ్యులు యశస్విని రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్బంగాస్థానిక శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మహిళా ల పైన. ప్రత్యేక శ్రద్ద పెట్టి వ్యాపార రంగం లో రాణించేలా సహకారం అందిస్తుందన్నారు.వడ్డీ లేని రుణాలు, సోలార్ ప్లాంట్, బస్సుల అప్పగింత తదితర ప్రోత్సాహకాలతో మహిళ లకి ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందన్నారు.తెలంగాణ లో ఎ మహిళా అయిన తమ అవసరాల కోసం ఎవరి దగ్గర చేయి చాపకుండా స్వేచ్ఛగా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారన్నారు.

# మహిళాల ఉన్నతే తెలంగాణ ప్రగతి

**కోటి మహిళలను కోటీశ్వరూలుగా చేయడమే తెలంగాణ ప్రభుత్వం సంకల్పం**

**ప్రతీ మహిళ, మహిళా సంఘం లో సభ్యత్వం తీసుకోవాలి**

**వ్యాపారాలు చేసి ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి భరోసా ఇవ్వాలి**

**మేడారం జాతర లో కూడా మహిళ లకే అధిక ప్రాధాన్యత**

**మంత్రి ధనసరి సీతక్క**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, స్థానిక శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు .జనగామ బైపాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్ శిల్పాలను అలాగే బస్టాండ్ చౌరస్తా జంక్షన్ వద్ద ఉన్న సూర్య నమస్కారాల శిల్పాలను ఆవిష్కరించినఅనంతరం బతుకమ్మ కుంటలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మరమ్మతులు, పునరుద్ధరణ పనులు పూర్తి అయినఆర్ అండ్ బి బంగ్లాను,వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ మహిళా ల ఉన్నతే తెలంగాణ ప్రగతి అనే నినాదం తోముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి కోటి మహిళలను కోటిశ్వరూలుగా చేయడమే సంకల్పంగా పెట్టుకున్నమన్నారు.ప్రతీ మహిళ, మహిళా సంఘం లో సభ్యత్వం తీసుకోని, వివిధ వ్యాపారాలు చేసి ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి భరోసా ఇవ్వాలన్నారు.ఎస్ఎచ్జి సంఘాల కు పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించి ఉపాధి కల్పించమన్నారు. ఎస్ఎచ్జి సభ్యులకె ధాన్యం కొనుగోలు భాద్యత ను అప్పగించాం.మహిళా లు ఎప్పటికి ఆర్థికంగా ఎవరి మీద ఆధార పడద్దు అని ప్రభుత్వం మహోన్నత మైన సంకల్పం తో ఎన్నో సంక్షేమ పథకాలకు రూపొందించిందన్నారు.40 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తు మహిళా ల ఆర్థికభివృద్ధి కి ప్రభుత్వం సహకరిస్తుందని,ప్రతీ నిరుపేద మహిళ కి సొంత ఇళ్ళు ఉండాలని,ఇందిరమ్మ ఇల్లు ను మహిళా పేరు మీదనే అందిస్తున్నమన్నారు.మేడారం జాతర లో కూడా మహిళ లకే అధిక ప్రాధాన్యత ఇచ్చి వారు వ్యాపారం లో ఎదిగేందుకు అవకాశం ఇచ్చాం.సోలార్ ప్లాంట్, పెట్రోల్ బంక్, ముదిరాజ్ కులస్తులకు వారి వ్యాపారం కోసం మొబైల్ వ్యాన్ మంజూరు, ఫంక్షన్ హల్ అప్పగింత, ఇలా ప్రతీ వ్యాపార రంగం లో మహిళ లను భాగస్వామ్యం చేస్తున్నమన్నారు. ఎస్ఎచ్జి సభ్యులు ఎవరైనా ప్రమాద వశాత్తు చనిపోతే వారి కుటుంబం ఆగం కావద్దని 10 లక్షల భీమా సొమ్ము, లోన్ భీమా కింద 2 లక్షల రూపాయలు అందుతాయన్నారు.ఎస్ఎచ్జి సభ్యుల కు నాణ్యమైన చీరలు ఇవ్వాలని సిరిసిల్ల నేతన్నల దగ్గర చీరలను తయారుచేయించి, ఈరోజు గ్రామీణ, పట్టణ మహిళా సంఘాల సభ్యులకు మంచి చీరలను అందించామన్నారు. ఆడపిల్ల అంటే భయపడొద్దు, మంచిగా చదివించి వారికి ఉన్నత మైన కేరిర్ లో నిలబడేంత వరకు తల్లిదండ్రులు అండగా ఉండాలని, ఈ అంశం మీద ఎస్ఎచ్జి సభ్యులు గ్రామ గ్రామన అందరికి అవగాహన కల్పించాలన్నారు.ఒక ఇంటి మహిళా బాగుంటే కుటుంబం బాగుపడుతన్నారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డివో గోపి రాం, జడ్పీ సీఈఓ మాధురి షా,పీసీసీ సభ్యులు లక్మినారాయణ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్, జనగామ నియోజకవర్గం ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మున్సిపల్, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు కసితో పని చెయ్యండి

**మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి**

**కొత్తకోట జనవరి 23 (ప్రభాత ఉదయం)**

కొత్త కోట మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిపించుకొని చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు, కసితో పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి కార్యకర్తలతో కలిసి పట్టణంలో బైక్ ర్యాలీ ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆల మాట్లాడుతూ కొత్తకోటను మున్సిపాలిటీని చేసిందే మనమని, అభివృద్ధి కొరకు 50, కోట్ల రూపాయల నిధులు, 30,పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేడ్ మార్కెట్ యార్డ్ ను తెచ్చింది కూడా మనమేనని అన్నారు. మనం తెచ్చిన పనులను కొన్ని పెండింగ్ పెట్టి వాటినే రిబ్బన్



కట్ చేస్తున్నారే తప్ప కొత్తగా జీవోలు తెచ్చి అభివృద్ధి కొరకు ఒక్క రూపాయి కూడా తెచ్చిన పాపన పోలేదని విమర్శించారు.రేవంత్ రెడ్డిని సీఎం చేస్తే పాలమూరును అభివృద్ధి చేస్తానన్నాడు ఆ మాటలకు 12 మంది ఎమ్మెల్యేల ను గెలిపిస్తే 90% కంప్లీట్ అయిన పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టును పండబెట్టిండని చెప్పారు. వందలాది బిఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ కాంగ్రెస్ నాయకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే కురుమూర్తి స్వామి పై ఒట్టేసి వంద రోజుల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాను చెప్పివి ఇప్పటివరకు ఏ ఒక్క పని కూడా చేయలేదని దేవుళ్లను కూడా మోసం చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. వందకు వందశాతం కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలంటే ఇప్పటినుండే కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, గాడిల ప్రశాంత్, కొండారెడ్డి, అయ్యన్న, ఖాజా మైనుద్దీన్, జగన్ మోహన్ రెడ్డి, షేక్ వహీద్, ప్రేమ దానం, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహం వ్యాధిగ్రస్తులు ఉచిత దృష్టి పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**కొత్తకోట జనవరి 23 (ప్రభాత ఉదయం )**



వనపర్తి జిల్లాలో వైద్య శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ మధుమేహ దృష్టి కార్యక్రమంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని మధుమేహం వ్యాధిగ్రస్తులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం కొత్తకోట మున్సిపాలిటీలోని 14వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న రేటినోపతి ఉచిత వైద్య పరీక్షల కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరుతెన్నులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్య శాఖ ద్వారా మిషన్ మధుమేహం 100 రోజుల కార్యక్రమం ద్వారా 30 సంవత్సరాల వయస్సు పైబడిన 3 లక్షల ఆరు వేల మందికి ఉచిత మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించి 19643 మంది వనపర్తి జిల్లాలో మధుమేహం వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మధుమేహం వ్యాధిగ్రస్తులకు రేటినోపతి వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందని, ఈ వ్యాధి దీర్ఘకాలంలో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని చెప్పారు. ఈ వ్యాధిని గుర్తించాలంటే పెద్ద పెద్ద కంటి ఆసుపత్రుల్లో మాత్రమే గుర్తించేందుకు అవసరమైన మిషన్లు ఉంటాయని కానీ ఫండస్కోపి ఎ.ఐ సాంకేతికతతో కొత్తగా వచ్చిన మిషన్ ద్వారా గ్రామాల్లో సైతం రేటినోపతి వ్యాధిని గుర్తించవచ్చుని. ఎంత ముందుగా వ్యాధిని గుర్తిస్తే అంత సులువుగా వ్యాధి బారినుండి బయటపడొచ్చన్నారు.అందుకే వనపర్తి జిల్లాలో ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాలోని మధుమేహం వ్యాధిగ్రస్తులకు గ్రామాలు, మున్సిపాలిటీల్లో 100 రోజుల దృష్టి కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 6007 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 385 మందికి రేటినోపతి, 9 మందికి గ్లకోమా వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఇందులో 341 మందికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫాలో అప్ వైద్య చికిత్సలు అందిస్తుండగా 39 మందిని పెద్ద కంటి ఆసుపత్రులకు సిఫారసు చేసి వైద్యం చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య శాఖ ద్వారా మధుమేహం దృష్టి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. జిల్లాలోని మధుమేహం వ్యాధిగ్రస్తులు దృష్టి వైద్య పరీక్షల బృందం తమ గ్రామానికి, వార్డుకు వచ్చినప్పుడు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని మిషన్ మధుమేహం దృష్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. అంతకుముందు కలెక్టర్ కొత్తకోటలో కొత్తగా ప్రారంభించిన బస్తీ దవాఖానను, వికలాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా సాయినాథ్ రెడ్డి, కొత్తకోట తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, డా. పరిమళ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై జాగ్రత్తే కార్మికుడి ప్రాణ రక్షణ

**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్.,**

**రోడ్డు భద్రతపై కార్మికులకు,చెరుకు వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించిన ఎస్పీ**

**రోడ్డు భద్రత వారోత్సవాల్లో ' అలైవ్ఉఅరైవ్'కార్యక్రమం 8వ రోజు అవగాహన**

**ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి**

**కొత్తకోట జనవరి 23( ప్రభాత ఉదయం )**




రోడ్డు ప్రమాదాలు ఒక్క కుటుంబానికే కాదు, సమాజానికే తీరని నష్టం కలిగిస్తాయని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, అన్నారు.రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న " అరైవ్ - అలైవ్ " కార్యక్రమంలో భాగంగా 8వ రోజు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకోట మండలం అప్పారాల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో పని చేసే కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు, చెరుకు రవాణా చేసే వాహనాల డ్రైవర్లు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. పరిశ్రమల ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు.వాహనాలను వేగంగా నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంలో నిర్లక్ష్యం వంటి కారణాల వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్మికులు విధులు ముగించుకుని సురక్షితంగా ఇంటికి చేరడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. అరైవ్ -అలైవ్ కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడమే లక్ష్యంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.ఉద్యోగం ఎంత ముఖ్యమోఆ ఉద్యోగి ప్రాణం అంతకన్నా విలువైనది. వేగం కాదు జీవితం గెలవాలని ఎస్పీ అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ, రాంబాబు, కొత్తకోట ఎస్సై, ఆనంద్, షుగర్ ఫ్యాక్టరీ మేనేజర్, రామారాజు, షుగర్ ఫ్యాక్టరీ లీగల్ అడ్వైజర్, భాస్కర్, పోలీస్ సిబ్బంది, షుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యువత సుభాష్ చంద్రబోస్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి

**బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**

**కూకట్ పల్లి, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

యువత సుభాష్ చంద్రబోస్ ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడవాలని బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి (పరాక్రమ దివస్) పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఉన్న చంద్రబోస్ విగ్రహానికి బిజెపి యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి చంద్రబోస్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని పోరాటపటిమను అలవర్చుకోవాలని



ఆయన ఆశయాన్ని కొనసాగించాలని నినాదం ఇచ్చారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ యువతలో అగ్ని జ్వాలలను రగిలించి భారత స్వాతంత్ర పోరాటంలో ఆజాద్ హిందూ ఫౌజ్ అనే సాయుధ దళాన్ని స్థాపించి బ్రిటిష్ సైన్యాన్ని తిప్పి కొట్టిన ధైర్యశాలి చంద్రబోస్ అన్నారు. భారతమాతను ఆంగ్లేయుల చెరసాలల నుండి విముక్తి చేయడం కోసం గొప్ప పోరాటాన్ని సాగించిన వీరుడు సుభాష్ చంద్రబోస్ అన్నారు. జననం తప్ప మరణం లేని మహోన్నత వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. అందుకే యువత ఇలాంటి చంద్ర బోస్ లాంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని చెడు దారిన వెళ్లకుండా మంచి మార్గంలో ప్రయాణించి ఉన్నత స్థాయిలో ఉండడానికి ప్రయత్నం చేయాలని, దేశం పట్ల, ధర్మం పట్ల గౌరవాన్ని పెంచుకొని దేశ హితం కోసం పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, రామరాజు, నాయకులు నర్సింగ్ యాదవ్, నరసింహ చారి, విష్ణు, సురేష్, ఆంజనేయులు, శ్రీను, నాగార్జున యాదవ్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ జమ్ములమ్మ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ**

**గద్వాల ప్రతినిధి,జనవరి 23(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని శ్రీజమ్ములమ్మ బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతున్న శ్రీ జమ్ములమ్మ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్ర వారాల్లో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. భక్తులకు తాగునీటి ఏర్పాటు, మరుగుదొడ్లు, పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. ఎమర్జెన్సీ సేవలను అందుబాటులో ఉంచాలని, మెడికల్ క్యాంపులను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు.

ప్రత్యేక బస్ షెల్టర్ ఏర్పాటు చేసి, అక్కడ మాత్రమే డ్రైవర్లు బస్సులు పార్క్ చేయాలని, రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులపై ఉన్న వైన్ షాపుల కారణంగా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, కిందకు వేలాడే విద్యుత్ తీగలు ఉంటే వాటిని పైకి సరి చేయించాలని విద్యుత్ శాఖ అధికారికి సూచించారు. చెరువు కట్ట పైనుంచి జలాశయంలోకి భక్తులు వెళ్లకుండా నిరంతర పర్యవేక్షణ చేయించాలని, నీటి ప్రమాదాలు జరిగితే భక్తులను రక్షించడానికి గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ తరపున అవసరమైన భాషల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జమ్ములమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జమ్ములమ్మ ఆలయ ఈఓ పురేందర్, జిల్లా మత్స్యశాఖ అధికారిని షకీలా భాను, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఎక్సైజ్ అధికారి గణపతి రెడ్డి, సిఐ టంగుటూరి శ్రీను, విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మహిళా మేయర్ కుదుముని దేవి

**కుష్టు వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకున్న మహోన్నతమైన వ్యక్తిత్వం రాణి కుదుముని దేవి**

**అన్ని వర్గాల వారికి అతి తక్కువ ధరలో వైద్యాన్ని అందించింది**

**రాందేవ్ రావు హాస్పిటల్ ఎండి డాక్టర్ కమలాకర్**

**కూకట్ పల్లి, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

1960 దశబ్దం లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కి మొదటి మహిళ మేయర్, విద్యావేత్త, సంఘ సంస్కర్త, నిస్వార్థ రాజకీయవేత్త, బహుముఖ ప్రజ్ఞశాలి, అట్టడిగిన వర్గాలకి, కుష్టు వ్యాధిగ్రస్తుల అశా దీపం, వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పించిన అపర ధన్వంత్రి, సమాజం లో వెలివేయబడిన కుష్టు వ్యాధి గ్రాస్తులకు శివనంద రెహబిలిటేషన్ హోమ్ స్థాపించిన, సమాజశీ లోని అన్నివర్గాలవారికి అతి తక్కువ ధరలలో వైద్యాన్ని అందిస్తున్న రాందేవ్ రావు హాస్పిటల్ వ్యవస్థాపకురాలు, వడ్డేపల్లి సంస్థానానికి చెందిన ఆడపడుచు, వనపర్తి సంస్థానానికి చెందిన కోడలు రాణి కుముదిని దేవి జన్మదినన్ని పురస్కరించుకొని శివనంద రెహబిలిటేషన్ హోమ్, రాందేవ్రావు హాస్పిటల్ కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజ్ అఫ్ నర్సింగ్ లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా రాందేవ్రావు హాస్పిటల్ లో రాణి కుముదిని దేవి చిత్ర పటానికి రాందేవ్ రావు హాస్పిటల్ ఎండి డాక్టర్ కమలాకర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసారు. ఈ కార్యక్రమం లో డాక్టర్స్, నర్సెస్, అడ్మినిస్ట్రేషన్, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొని కుముదిని దేవి చేసిన కార్యక్రమాలు కొనియాడారు. శివనంద రెహబిలిటేషన్ హోమ్ లో కుముదిని దేవి విగ్రహానికి రంతిదేవ్ రావు, మీరా రావు, విక్రందేవ్ రావు, జ్యోతి రావు, విజయలక్ష్మి, పృథ్వీ రెడ్డి, భారతి రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డి, శివానంద రిహబిలిటేషన్ హోమ్ సీఈఓ డాక్టర్ అనంత్ రెడ్డి, పూల మాలతో విగ్రహాన్ని అలంకరించారు. జస్టిస్ జగన్నాద్ రెడ్డి సతీమణి పరిమళ జగన్మోహన్ రెడ్డి పేరు మీద ఉచిత శివనంద ఫిజియో రిహబ్ సెంటర్ ప్రదీప్ చౌదరి ప్రారంభించారు. పరిమళ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని జయరాం పింగళి, ఊర్మిళ పింగళి, గౌతమ్ పింగళి, సురేఖ పింగళి, విద్యాసాగర్ రావు, దీపిక ఆవిష్కరించారు. అనంతరం రాణి కుముడిని దేవి స్కూల్ అండ్ కాలేజీ అఫ్ నర్సింగ్ లో కొత్తగా ప్రవేశించిన బీఎస్సీ, జి ఎన్ ఎం విద్యార్థిని విద్యార్థులకు లాంప్ లైటింగ్ సెరేమోనీ ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ ను మేరీ డేవిడ్, కాలేజీ ప్రిన్సిపాల్ అర్చన విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో రాందేవ్ రావు హాస్పిటల్ సీఈవో యోబు, ఇతర హాస్పిటల్, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కాటేదాన్, శివరాంపల్లి, రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ లలో

# విద్యుత్ సరఫరా అంతరాయం

**రాజేంద్రనగర్/బండ్లగూడ, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

కాటేదాన్, శివరాంపల్లి, రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని ఆయా సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్లు తెలిపారు. కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం మూడున్నర వరకు దుర్గా నగర్, కళ్ళు కాంపౌండ్, దుర్గా నగర్ హిల్స్, నాగ మల్లయ్య వెంచర్, దుర్గామాత టెంపుల్ ఏరియా, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంతం, శాంతినగర్, గణేష్ నగర్, పయనీర్ స్కూల్, గవర్నమెంట్ స్కూల్, గణేష్ నగర్, విజయ్ సేల్స్, న్యూ మై ఫిల్ హోటల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.



**శివరాంపల్లి లో...**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. సెక్షన్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు చింతల్ మెట్టు విద్యుత్తు ఫిల్టర్ పరిధిలో గల ప్రాంతాలైన చింతల్ మెట్, పహడి, సులేమాన్ నగర్, డైమండ్ సిటీ, గోల్డెన్ సిటీ, హసన్ నగర్, ఎన్ పి ఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు హసన్ నగర్, శివరాంపల్లి, ప్రశాంత్ కాలనీ ఎన్టీఆర్ నగర్ ప్రాంతాలలో సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు.

**రాజేంద్రనగర్ లో...**

రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు. సెక్షన్ పరిధిలో రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉప్పరపల్లి, హ్యాపీ హోమ్స్ కాలనీ, సత్సంగ్ విహార్ కాలనీ, జన చైతన్య ఫేస్ హ1,2,3, జలాల్ బాబా నగర్, ఎం ఎం ఆడి, భగవతి గూడ ప్రాంతం, ఖయ్యూంనగర్, హరినాథ్ రెడ్డి ఎంక్లేవ్, చింతల్ మెట్, అక్బర్ హిల్స్, సులేమాన్ నగర్, పరమారెడ్డి హిల్స్ ప్రాంతాలలో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**హిమాయత్ సాగర్ లో..**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్ల నిమిత్తం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు మిలిటరీ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పి అండ్ టీ కాలనీ ఏ బి సి డి, స్పెషల్ బ్లాక్స్, మ్యాప్ ప్లే టౌన్, విశ్వాస్ టౌన్, హైదర్ ఎంక్లేవ్, స్నేహిత హిల్స్ లీడర్ పరిధిలో గల ప్రాంతాలైన స్నేహిత హిల్స్ ఫేస్-1,2, బ్రాడ్ వే హోటల్, స్నేహిత హిల్స్, జే ఎన్ ఎన్ ఆర్ యు ఎన్ క్వార్టర్స్, పీబీల్ సిటీ, పెద్ద మంగళారం విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి 2:30 వరకు హీరా కాలనీ, సన్ సిటీ ప్రధాన రహదారి, సి వై ఆర్ కన్వెన్షన్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిల్ నగర్, హైదర్ షా కోర్టు విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్తావనగర్ నగర్, తిరుమల గార్డెన్, రాధా రియాక్టర్స్ ఫేస్ హ2, పవన్ హార్మోని విల్లాస్, బచ్పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ ప్రధాన రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ ఇన్చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల అసిస్టెంట్ విద్యుత్ ఇంజనీర్లు కోరారు.

# గోపాలనగర్‌లో హైడ్రా విస్తృత చర్యలు

**గత పది సంవత్సరాల బిఆర్ఎస్ నాయకుల కబ్జాల నుంచి గోపాల్ నగర్ కు విముక్తి**

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు**

**పార్కు స్థలాలు కబ్జాల నుంచి విముక్తి...కుకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదే శివ**

**కూకట్ పల్లి, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గంలోని గోపాలనగర్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం నుంచి హైడ్రా బృందం విస్తృతంగా చర్యలు చేపట్టింది. 10 సంవత్సరాలుగా కబ్జాలకు గురైన విలువైన ప్రభుత్వ పార్కు స్థలాలను గుర్తించి, వాటిని కబ్జాల నుంచి విముక్తి చేసే కార్యక్రమాన్ని హైడ్రా అధికారులు విజయవంతంగా నిర్వహించారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కుకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సుమారు పదిహేను రోజుల క్రితం గోపాలనగర్‌లో పర్యటించి, కాలనీలోని సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులపై జరుగుతున్న అక్రమ కబ్జాలను గుర్తించి, ఆ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి తెలియజేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కృషికి ఫలితంగా హైడ్రా అధికారులు రంగంలోకి దిగి, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి విముక్తం చేశారు. గత పదేళ్లుగా అక్రమంగా ఆక్రమించబడిన ఈ భూములను ప్రజా వినియోగానికి కాపాడాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ స్థలాలను పార్కులు, ప్రజలకు అవసరమైన సదుపాయాల కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విజయవంతమైన చర్యలకు సంబంధించి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి స్థానిక కాంగ్రెస్ నాయకుల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు సహకరించిన అడ్వకేట్ సంఘ సంస్కర్త రాధాకృష్ణ కి, లోకల్ నాయకులు ఆర్‌కే, సుధీర్, శివరాం, అజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్, కిలారి బాబు, మధు, సాంబశివరావు, శ్రీనివాస్ రావు, యకనారాయణ, భాను, చైతన్య, జాలిపత్తి శ్రీకాంత్, స్థానిక ప్రజలు తదితరులు, కార్యకర్తలకు పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు. గోపాలనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ భూముల రక్షణ దిశగా కీలకమైన అడుగుగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.




# సుభాష్ చంద్రబోస్‌కు ఘనంగా నివాళులు





## రక్తదానం చేయడం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుంది.

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ సర్కిల్ ) జనవరి 23 ( ప్రభాత ఉదయం):**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్రం కోసం విరోచిత పోరాటం చేసిన మహనీయుడని విశ్వగురు శాఖ ప్రతినిధులు గడ్డం మహేష్ అన్నారు. శుక్రవారం అన్నోజిగూడ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా విశ్వగురు శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో అత్యంత ఉత్సవంతో యువత ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా గడ్డం మహేష్ మాట్లాడుతూ భారత స్వాతంత్రం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ విరోచిత పోరాటం చేసిన మహనీయునన్ని మరువరాదన్నారు.దేశ స్వాతంత్ర్యానికి తన జీవితాన్ని అంకితం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను స్మరించుకుంటూ ఈ సేవా కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. నిబంధనలను పాటి. ఈ కార్యక్రమంలో విశ్వగురు శాకా ప్రతినిధులు గడ్డం మహేష్, కోన మల్లేష్, విక్రమ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహేష్, నాగరాజు, బాలాజీ, రామచందర్ రెడ్డి, సత్య నారాయణ రెడ్డి తో పాటు వక్తలు పల్లె నరేంద్ర రెడ్డి, చిన్ రాజు, శివ శంకర్, అన్నోజి గూడ పెద్దలు మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, బిక్కు నాయక్, రాజేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్ , కె ఎం రెడ్డి, జితేందర్ నాయక్, శివ , అజయ్, రేతి వెంకటేష్ శేఖర్,, బాలు, పంజాల వంశీ గౌడ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.భారత స్వాతంత్ర పోరాట యోధుడు :నాయకుడు సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర సంగ్రామంలో ముందు నడిచిన మహా నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అల్వాల్ సూర్య నగర్ కాలనీ నాయకులు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం సూర్య నగర్ కాలనీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్య నగర్ కాలనీ వాసులు కృష్ణమూర్తి మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర సంగ్రామంలో ముందు నడిచిన మహా నాయకుడని కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహా దేశభక్తుడు అని అన్నారు. ఆయన అడుగుజాడలో యువత నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోగా కృష్ణమూర్తి ,గోపి తో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు



## స్వతంత్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర ఎనలేనిది...

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు...**

**కూకట్ పల్లి, జనవరి 23 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీలో సైతం మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ కంటే గొప్ప పేరు ఉండడంతో పాటు జననం తప్ప మరణం లేని గొప్ప నాయకుడు ఎవరైనా ఉన్నారు అంటే అది సుభాష్ చంద్రబోస్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.ఛత్రపతి శివాజీ ధర్మ రక్షణ సేన వ్యవస్థాపకుడు కర్ర వేణు గోపాల్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి కేపి.హెచ్.బి కాలనీ రోడ్డు నెంబర్ 1 వద్ద ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించి జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ఆజాద్ హింద్ ఫౌజ్ అని ఏర్పాటు చేసి దేశాన్ని ఒక్కతాటిపైకి తీసుకొని వచ్చి బ్రిటీషర్లపై పోరు చేసేలా చర్యలు చేపట్టారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న వికసిత భారత్ నిర్ణయాన్ని సుభాష్ చంద్రబోస్ ఆలోచనల నుంచి స్వీకరించడం జరిగిందని అన్నారు. దేశంలోని యువతకు రానున్న నూతన తరానికి ఆయన స్ఫూర్తి ఎంతో మేలు చేస్తుందని ఆ విధంగానే యువత కూడా ఆలోచనలతో అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, బిజెపి నేతలు నరేష్, స్రవంతి, ప్రియతమ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యంజల పద్మయ్య, కుమార్ యాదవ్, వినోద్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు



## ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలను కల్పించాలి: వజ్రేష్ యాదవ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ సర్కిల్ ) జనవరి 23 ( ప్రభాత ఉదయం ):**

గట్టు మైసమ్మ జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. శుక్రవారం ఘట్కేసర్ సర్కిల్ పరిధిలో నిర్వహించనున్న గట్టు మైసమ్మ మహ జాతర ఏర్పాట్లను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాల శుభ్రత, భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. త్రాగునీరు, విద్యుత్, భద్రత వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. ప్రజల విశ్వాసాలతో ముడిపడి ఉన్న జాతరను విజయవంతంగా నిర్వహించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక ప్రధాన కార్యదర్శి వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, మాజీ చైర్మెన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మచందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తుల కోరికలు తీర్చే అమ్మవారుగా వెలుగొందుతున్నారు: శ్రీకాంత్ యాదవ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహర్ నగర్ డివిజన్ )**

**జనవరి 23 ( ప్రభాత ఉదయం)**

భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారుగా ముత్యాలమ్మ తల్లి వెలుగొందుతున్నారని నగర పాలక సంస్థ జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ ముత్తుస్వామి కాలనీలో ముత్యాలమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్ లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల కోరికలు తీర్చే అమ్మవారుగా ముత్యాలమ్మ తల్లి వెలుగొందుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ చారి, తిరుపతి, అజయ్ కుమార్ , జంగిటి శ్రీనివాస్, సాయి నేత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608